సాక్షి
వికారాబాద్

మంగళవారం । 24 । జనవరి । 2023



సాగుకు అందని తీరు
కోటపల్లి ప్రాజెక్టు సాగునీరు పంటలకు సక్రమంగా అందక చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



బాల్య వివాహాలు నేరం
బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. 8లో▸



పోరాట యోధుడు నేతాజీ
దేశ ప్రజల స్ఫూర్తి కెరటం నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

28న మెగా జాబ్‌మేళా

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని నర్సింగ్ గాలికర్ ఫంక్షన్ హాల్‌లో జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువత, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్య కోర్సులు చేసిన వారు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 63042 50542, 99599 03463లలో సంప్రదించాలని కోరారు.

బకాయిలపై దృష్టి సారించండి

విద్యుత్ శాఖ ఎస్‌ఈ జయరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ జయరాజు

కొడంగల్ రూరల్: విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ శాఖ ఎస్‌ఈ జయరాజు సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల సబ్‌స్టేషన్లలో పని చేసే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసే సమయంలో సేఫ్టీ పరికరాలను ధరించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు ఉంటే వినియోగదారులు సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పూర్తిస్థాయి విద్యుత్ బకాయిల వసూలుపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ నవీన్ కుమార్, ఆయా మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ గ్రేడ్‌కు సహకరించాలి

అనంతగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మొట్టమొదటి దూరవిద్యా విశ్వ విద్యాలయమని, యూనివర్సిటీ న్యాక్ గ్రేడ్ కోసం వెళుతోందని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వికారాబాద్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ చిన్న సోమన్న కోరారు. సోమవారం పట్టణంలోని స్టడీ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా సర్వే ఫారంతో యూనివర్సిటీ గురించి 20 ప్రశ్నలు అడగడం జరుగుతుందన్నారు. వాటికి అనుకూలంగా సమాధానం చెబితే విశ్వవిద్యాలయానికి మంచి మార్కులు వచ్చే అవకాశంతో పాటు న్యాక్‌లో మంచి గ్రేడ్ వస్తుందన్నారు. న్యాక్ ఫారం నింపడానికి ఏదైన సమస్య ఎదురైతే సెల్ నంబర్ 73829 29670కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మందారిక, డైరెక్టర్ అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సహజ యోగా రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి



మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కొడంగల్ రూరల్: ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సహజ యోగా రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో యోగా శిక్షణ శిబిరాలను నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో నిర్వహించిన యోగా శిక్షణ శిబిరంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారతదేశంలో విద్యా విధానంలో యోగాకు ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. 1970లో యోగా సిద్ధాంతాన్ని ప్రారంభించారని చెప్పారు. ప్రపంచంలోని 70దేశాల్లో యోగా అమలవుతోందన్నారు. యోగాతో శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుందని వివరించారు. బీపీ, షుగర్, వెన్నెముక, మెడ, కండరాల నొప్పులు, అజీర్ణం, మలబద్ధకం తదితర ఎన్నో వ్యాధులనుంచి శరీరం త్వరగా కోలుకునేందుకు యోగా దోహదపడుతుందన్నారు. అనంతరం సహజ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, పాల్గొన్న సిబ్బంది మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎంఈఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నీటితో కళకళలాడుతున్న సర్పన్‌పల్లి ప్రాజెక్టు

సాగు డీలా..!

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిస్థితి. ఈ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. రెండేళ్ల క్రితం వరకు పంటలతో కళకళలాడిన ఈ ప్రాంతం నేడు బీడు భూములతో దర్శనమిస్తోంది. మరమ్మతుల పేరిట కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా రైతులకు మాత్రం ప్రయోజనం చేకూరడం లేదు.

నిండుకుండలా సర్పన్‌పల్లి ప్రాజెక్టు
- ఆయకట్టు 3,285 ఎకరాలు
- నీరందుతోంది 700 ఎకరాలకే
- కాల్వలు దెబ్బతినడంతోనే ఈ దుస్థితి
- బాగు చేయాలంటున్న రైతులు

వికారాబాద్ అర్బన్: మండలంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టు నిండుకుండలా దర్శనమిస్తోంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురియడంతో ప్రాజెక్టు పొంగి పొర్లింది. మొదట్లో కురిసిన ఒకటి, రెండు వర్షాలకే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటిమట్టం(8 ఫీట్లు) చేరింది. సాగుకు కావాల్సినంత నీరు ఉన్నా రైతులకు లాభం లేకుండా పోయింది. ఈ ప్రాజెక్టు పరిధిలో గొట్టిముక్కల, సర్పన్‌పల్లి, ద్యాచారం, నైనాపూర్ మరో రెండు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో 3,285 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం రెండు గ్రామాల పరిధిలోని 700 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరందుతోంది. మిగిలిన 2,585 ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. దీంతో వందలాది మంది రైతులు పంటలు పండించుకోలేని స్థితిలో ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం



పిచ్చిమొక్కలతో నిండిన కుడి కాలువ

వరకు ఈ ప్రాజెక్టు కింద ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసేవారు. పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. మరమ్మతుల పేరిట కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా సాగుకు సరిపడా నీరందడం లేదు.

దెబ్బతిన్న కాలువలు

సర్పన్‌పల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక చోట్ల కాలువల్లో మట్టి పేరుకుపోయి నీరు ముందుకు పోవడం లేదు. పొలాల్లోకి నీరు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన తూములు తుప్పు పట్టిపోయాయి. కాలువల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో వాటి రూపురేఖలు మారిపోయాయి. ఎడమ కాలువ కింద 1,121 ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం 300 ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. కుడి కాలువ కింద 2,165 ఎకరాల ఆయకట్టు ఉండగా 400 ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది.

మరమ్మతులకు రూ. కోట్లు

ప్రాజెక్టు మరమ్మతుల కోసం నీటి పారుదల శాఖ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. మిషన్ కాకతీయలో భాగంగా రూ. 20లక్షల ఖర్చు చేశారు. 2014లో కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ పథకం కింద రూ. 3.50కోట్లు కేటాయించింది. ఈ నిధులతో కాలువలు, ఇతర మరమ్మతు పనులు చేశారు. ఇంత ఖర్చు చేసినా నాలుగు ఏళ్ల నుంచి 700 ఎకరాలకు మించి నీరు అందడం లేదు. కాలువల మరమ్మతులకు సుమారు రూ. 50లక్షలు అవసరం ఉన్నట్లు సమాచారం.

ప్రతిపాదనలు పంపాం

సర్పన్‌పల్లి ప్రాజెక్టు కాలువలు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందేలా చూస్తాం.

– వరప్రసాద్, ఇరిగేషన్ ఏఈ, వికారాబాద్

పురుగు మందు రహిత పంటలే మేలు

- ఉద్యాన శాఖ ఉప సంచాలకులు భాగ్యలక్ష్మి

వికారాబాద్ అర్బన్: పురుగు మందు రహిత పంటలు సాగు చేయడం వల్ల ఇటు ప్రజలకు, అటు రైతులకు మేలు చేకూరుతుందని ఉద్యాన శాఖ రాష్ట్ర ఉప సంచాలకులు పీవీ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాష్ట్ర ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లా రైతులకు పురుగు మందు రహిత పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పండ్లు, కూరగాయల పంటలపై చీడ పీడలు, ఈగ సమస్య ఉధృతి పెరుగుతోందన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి రైతులకు అవగాహన అవసరమన్నారు. అధికారులు సైతం రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తుండాలని తెలిపారు. జిల్లాలో 13,099 ఎకరాల్లో మామిడి, 12,000 ఎకరాల్లో కూరగాయల సాగు అవుతున్నట్లు తెలిపారు. మామిడి, కూరగాయల సాగును మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి డీ చక్రపాణి, సహాయ సంచాలకులు సువర్ణ, శాస్త్రవేత్త డాక్టర్ డీ అనిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప సంచాలకులు భాగ్యలక్ష్మి

అడగకుండానే ఇంటి జాగా..

- మంత్రి సబితారెడ్డి
- ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు పట్టాల పంపిణీ

కందుకూరు: ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులకు అడగకుండానే వారి త్యాగం, కష్టాన్ని గుర్తించి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పెద్ద మనస్సుతో పరిహారానికి అదనంగా ఇంటి జాగా అందిస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచెలకు చెందిన ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 325 మంది రైతులకు సోమవారం ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్టిఫికెట్లను జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫార్మాకు సేకరించిన భూమిలో 600 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి చేసి భూమి కోల్పోయిన ప్రతి రైతుకు ఎకరాకు 121 గజాల స్థలం అందించనున్నట్లు తెలిపారు. గుంట భూమి కోల్పోయిన రైతులకు సైతం 60 గజాల చొప్పున స్థలాన్ని ఇస్తున్నామన్నారు. భూములు ఇచ్చిన ప్రతి రైతుకు ఎలాంటి నష్టం జరగకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్లాట్లను ఎవరూ అమ్ముకోవద్దని ఇది ముఖ్యమంత్రి ఇచ్చిన బహుమతిగా భావించాలన్నారు. గతంలో పవర్‌గ్రిడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు ఇస్తామని చెప్పారు. లేఅవుట్ పూర్తయిన తర్వాత డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు. ఫార్మాసిటీతో పాటు అమేజాన్, మెడికల్ కళాశాల, ఫార్మా యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువతకు శిక్షణ ఇచ్చి స్థానికంగా ఏర్పాటయ్యే కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలతో రైతులు లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచులు జ్యోతి, సరళమ్మ, ఎంపీటీసీ కాకి రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సాయిలు, మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, ఇందిర, సర్పంచులు రామచంద్రారెడ్డి, కలమ్మ, మంద సాయిలు, నరేందర్, భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు గండు నర్సింహ, కాకి రవి, ఇ.సత్తయ్య, డి.నర్సింహ, కాకి నర్సింహ, ఆర్ ప్రభాకర్‌రెడ్డి, నందీశ్వర్, కృష్ణారెడ్డి, ఆనంద్, సామయ్య తదితరులు పాల్గొన్నారు.



మీర్‌ఖాన్‌పేటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు



సిబ్బందికి కంటి అద్దాలు అందజేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఐక్యతతో బ్రాహ్మణిజాన్ని కాపాడుకుందాం

- సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌రావు

తాండూరు: బ్రాహ్మణుల ఐకమత్యంతోనే పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచార, వ్యవహారాలను కాపాడుకుంటామని బ్రాహ్మణ సేవా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌రావు అన్నారు. పట్టణంలోని సీతారాంపేట్ పాండురంగస్వామి ఆలయంలో తాండూరు శాఖ ఆధ్వర్యంలో బ్రాహ్మణ గర్జన ధ్వజ పత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రతినిధులు, తాండూరు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్యాణ్‌రావు మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో బ్రాహ్మణుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. బ్రాహ్మణులు ఆలయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అలాంటి ఆలయాలపై రాజకీయ పెత్తనం అధికమైందన్నారు. మరోవైపు బ్రాహ్మణుల ఆర్థిక పరిస్థితి దిగజారి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధనకు ఏప్రిల్ 23న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బ్రాహ్మణ గర్జన సభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు కరణం పురుషోత్తంరావు, అశోక్ చంద్రగౌతమ్, రాఘవేందర్‌రావు, పురంధరాచార్యులు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ గర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

కలెక్టరేట్‌లో ‘కంటి వెలుగు’

వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో ప్రత్యేక కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నిఖిల తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీ, జిల్లా కోర్టు అధికారులు, సిబ్బంది విడతల వారీగా ఈ శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీ కార్యాలయం అధికారులు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న పలువురు అధికారులకు కలెక్టర్ అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి పాల్వాన్ కుమార్, ఉప వైద్యాధికారి జీవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆఫీసులో..

అనంతగిరి: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది పోలీసులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంఏ రషీద్ తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పనులు పూర్తి చేయండి

వికారాబాద్ అర్బన్: మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను ఈ నెల 27వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ నిఖిల సంబంధిత శాఖల ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం మన ఊరు – మన బడి పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడతలో 38 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో 19 పాఠశాలలను వారం రోజుల్లో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. అలాగే పాఠశాల ఆవరణలో పూల మొక్కలు నాటాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని, వెంటనే సమకూరుస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే పాఠశాలల్లో ఆట వస్తువులు, గ్రీన్ చాక్ బోర్డ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలని వినతి

అనంతగిరి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ పదోన్నతులలో పాటుగా భాషా పండితుల, పీఈటీల పదోన్నతులు చేపట్టాలని పండిత, పీఈటీ జేఏసీ వికారాబాద్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ నిఖిల, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, డీఈఓలకు వినతిపత్రం అందజేశారు. రెండు దశాబ్దాలుగా భాషా పండితులు, పీఈటీలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎజాస్, రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌యూపీపీటీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, రామకృష్ణ, రాజశేఖర్, భీమయ్య, వెంకటయ్య, శ్రీలతారెడ్డి, రాధాబాయి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాదిలో తెలంగాణయే అనుకూలం

- కొంచెం కష్టపడితే అధికారం ఖాయం: కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి

అనంతగిరి: దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ పుంజుకుంటోందని, ప్రస్తుతం అధికారం చేపట్టేందుకు ఏదైనా రాష్ట్రం ఉందంటే అది తెలంగాణయేనని బొగ్గు, గనులు, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని కొండా బాలకిష్టారెడ్డి ఫంక్షన్ హాల్‌లో లోక్‌సభ ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముందుగా జిల్లా కోర్ కమిటీ సమావేశం, ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కొంచెం కష్టపడితే తెలంగాణలో అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన సాగిస్తుంటే.. తెలంగాణలో కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో అందినంత దోచుకున్న కేసీఆర్.. ఇప్పుడు బీఆర్‌ఎస్ పేరిట దేశాన్ని ముంచేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలో ఒకే కుటుంబంలో 9 మందికి టికెట్లు ఇవ్వడానికి ఆ పార్టీ సిద్ధమైందని విమర్శించారు. అబద్ధాలు మాట్లాడటంలో కేసీఆర్ దిట్ట అని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తోందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చూపించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తామే చేస్తున్నామని గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్ కావడం వల్ల ఒరిగేదేమి లేదన్నారు. బూత్ స్థాయిలో విజయం సాధిస్తే చాలు అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక కరెంట్ ఉత్పత్తిలో దేశం సర్‌ప్లస్‌లో ఉందన్నారు. దేశంలో కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఉచితంగా కోవిడ్ వ్యాక్సిన్ అందించారన్నారు. ప్రపంచంలో ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున వ్యాక్సినేషన్ కార్యక్రమం జరగలేదన్నారు. నేటికీ పెద్దపెద్ద దేశాల్లో కోవిడ్ పూర్తిగా అదుపులోకి రాలేదన్నారు. నాడు మనం కోవిడ్ వ్యాక్సిన్ డెవలప్ చేయడం వల్ల పెద్ద ప్రమాదం నుంచి బయటపడి అందరం క్షేమంగా ఉన్నామన్నారు. నేడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రకు మంచి స్పందన వస్తోందని తెలిపారు. దీంతో తెలంగాణ ప్రజలు బీజేపీని ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కమిటీలో 22 మంది సభ్యులు ఉండాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరాలన్నారు. ఇందుకోసం కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అనంతరం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వికారాబాద్ నియోజకవర్గానికి అందజేసిన స్వచ్ఛ భారత్ వాహనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మల్లారెడ్డి, వికారాబాద్ అసెంబ్లీ పాలక్ జీవిత రాజశేఖర్, ప్రభారి విద్యాసాగర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాండుగౌడ్, రమేష్‌కుమార్, వెంకటయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

క్లుప్తంగా

ఆటో, బైక్‌ ఢీ..
వ్యక్తికి తీవ్ర గాయాలు

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. కుల్కచర్లలో నివసిస్తున్న దస్తప్ప(55) దాదాపూర్‌ నుంచి కుల్కచర్ల వైపు బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. ఈక్రమంలో బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ఎదురెదురుగా వస్తున్న ఆటోను బైక్‌ ఢీకొట్టింది. దీంతో దస్తప్ప కుడి కాలు విరగడంతోపాటుగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోడలు తప్పటడుగు.. మామ ఆత్మహత్య

దోమ: కోడలు చేసిన తప్పుతో కొడుకు జీవితం ఇబ్బందికరంగా మారిందని ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దోమ పీఎస్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విశ్వజన్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బడేంపల్లి గ్రామానికి చెందిన చెక్కలి నర్సింహులు(58) కుమారుడు అంజిలయ్యకు గ్రామానికి చెందిన బోయిని హరి కూతురు భాగ్యతో వివాహమైంది. వారి కాపురం మూడు నెలలపాటు సాఫీగానే సాగినా.. ఇటీవల గ్రామానికి చెందిన తొంట నరేశ్‌ అనే వ్యక్తితో ఇంట్లోంచి వెళ్లిపోయింది. దీంతో బాధిత కుటుంబీకులు పరిగి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నరేశ్‌, భాగ్యను పట్టుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు నర్సింహులు తమ కొడుకును ఎందుకు వదిలి వెళ్లిందని భాగ్య తల్లిదండ్రులను ప్రశ్నించాడు. వారు సమాధానం ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఉదయం పొలం వద్ద చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భాగ్య మరోవ్యక్తితో వెళ్లిపోవడంతోనే మా నాన్న మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అంజిలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన మృతికి కారకులైన బోయిని హరి, జయమ్మ, భీమమ్మ, అనసూజ, ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్‌ఐ విశ్వజన్‌ కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బైక్‌ అదుపుతప్పి..
యువకుడి మృతి


రాజేశ్‌ (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: బైక్‌ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్‌ జిల్లా బల్మూరు మండలానికి చెందిన మిడిగొల్ల రాములు కుమారుడు రాజేశ్‌(20) రావిర్యాలలో నివాసం ఉంటూ జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన స్నేహితుడు చందూతో కలిసి రావిర్యాల నుంచి తుక్కుగూడకు ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డు మీదుగా బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌ అదుపుతప్పడంతో తీవ్రగాయాలైన రాజేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్‌: రైలు ఢీకొని గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కేశంపేట రైల్వేగేటు సమీపంలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని కేశంపేట రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు సోమవారం రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 94414 07039 నెంబర్‌కు సమాచారం అందించాలని రైల్వే పోలీస్‌ శ్రీనివాస్‌ కోరారు.

నిండా నీరు.. పైరుకు అందని తీరు

చివరి భూములకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగునీరు రాకపోవటంతో.. పలు మండలాల్లో యాసంగి పంటలు ఎండిపోతున్నాయి. సిబ్బంది కొరతతో కాల్వల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఆరు తడులు అందక ఎండిపోతున్న ఆయకట్టు కింద పంటలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


జనగాం శివారులో ఎండిపోతున్న వేరుశనగ పంట

పెద్దేముల్‌: కోటపల్లి ప్రాజెక్టు సాగునీరు పంటలకు సక్రమంగా అందక చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి పంటలో ప్రాజెక్టు క్రింద వేరుశనగతో పాటు వరి ఇతర పంటలు సాగు చేశారు.ప్రాజెక్టు సామర్థ్యం 9,200 ఎకరాలకు నీరు అందాల్సి ఉంది. కాల్వలు, షటర్లు , తూములు సక్రమంగా లేక ఏటా సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోతోంది. నేడు 4వేల ఎకరాలకు కూడ సక్రమంగా నీరు అందడంలేదనే ఆరోపనలు వస్తున్నాయి. యాసంగి పంటల ద్వారా పెద్దేముల్‌ మండలంలోని మంబాపూర్‌, జనగాం, దుగ్గాపూర్‌, మారేపల్లితండా, ఖానాపూర్‌తో పాటు పలు గ్రామాల రైతులు వేరుశనగ పంటలతో పాటు వరి ఇతర పంటలు సాగు చేశారు. చివరి భూములకు సక్రమంగా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ప్రతీ సంవత్సరం చివరి భూములకు సక్రమంగా నీరు అందక ఇబ్బందులు పాలవుతున్నామని పలు గ్రామాల రైతులు అంటున్నారు. పూర్తి స్థాయిల్లో సిబ్బంది లేక సాగు నీరు వాగుపాలవుతోంది. ఈ విషయాన్ని ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌, ఎంపీటీసీ సభ్యులు, పాలకులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునే వారే లేరనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్టు అధికారులు మాత్రం 4నుంచి 4500ల ఎకరాలకు నీరు వదులుతున్నామని లెక్కలు చూపుతున్నారు. కానీ 3వేల ఎకరాలకు కూడా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. వేరుశనగ సాగు చేసిన రైతులకు ఆరుతడులకు నీరు వదులాల్సి ఉంటుంది. అధికారులు ఇప్పటి వరకు రెండు, మూడు తడుల నీరు మాత్రమే వదిలారు. వదిలిన నీరు కూడా సక్రమంగా అందడం లేదని, పంటలు చేతికి వచ్చే వరకు నీరు అందుతుందన్న నమ్మకం కలుగడం లేదని రైతులు ఆవేదన వెళ్లిబుచ్చుతున్నారు. 20 రోజుల నుంచి 25 రోజుల వరకు పంటకు నీరు వదలాలి. రెండవ తడిలో 25రోజులు దాటిన నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు సిబ్బంది కొరత సైతం ఇబ్బంది పెడుతోందని రైతులు చెబుతున్నారు. 15 మంది గ్యాంగ్‌మెన్‌లకు ఒక్కరు కూడా లేరని.. ఉన్న వారు పదవీ విరమణ పొందడంతో ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా మారిందంటున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఎకరా వేరుశనగ పంట సాగు చేసేందుకు సుమారు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తతోందని రైతులు అంటున్నారు. దిగుబడి ఎకరాకు 15నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తే చేసిన కష్టానికి, పెట్టుబడులకు కాస్త లాభం ఉంటుందని అంటున్నారు. పెరుగుతున్న పెట్టుబడులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఐదెకరాల్లో సాగు



ఐదెకరాల్లో సుమారు రూ.లక్ష ఖర్చు చేసి వేరుశనగ పంట సాగుచేశా. ఇప్పటి వరకు రెండు తడులకు నీరు వచ్చింది. బుడ్డలు వచ్చే సమయంలో నీరు సక్రమంగా అందాలి. కానీ 25 రోజులు దాటినా ఇప్పటి వరకు నీరు అందలేదు. దీంతో పంట ఎండిపోతోంది. పంటలు పాడైతే తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి భూములకు అందేలా చర్యలు తీసుకోవాలి.

– గంజి వెంకటేశం, రైతు, జనగాం

ప్రతీ ఎకరాకు నీరు



కోటపల్లి ప్రాజెక్టు కింద వేరుశనగ పంటలు సాగుచేసిన రైతులకు సాగునీరు ఇబ్బంది రాకుండా చుస్తాం . ప్రతీ ఎకరాకు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం, కాల్వలు సక్రమంగా లేక.. నీరు అందలేదు. ముందుగా చివరి భూములకు నీరు అందేలా చూడాలని సిబ్బందికి తెలిపాం. సమస్యలు ఉంటే తమకు ఫిర్యాదు చేయండి వెంటనే పరిష్కరిస్తాం.

– నవీన్‌, ఏఈ, కోట్‌పల్లి ప్రాజెక్టు

బాలుడి బలవన్మరణం

దోమ: కుటుంబీకులు మందలించారనే కారణంగా ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విశ్వజన్‌, స్థానికులు తెలిపిన ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కావలి వెంకటేశ్‌(17) గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రేమ వ్యవహారమే కారణమా..?

వెంకటేశ్‌ మృతికి ప్రేమవ్యవహారమే కారణంగా తెలుస్తోంది. ఇన్‌స్టాగాంలో నిజామాబాద్‌కు చెందిన ఓ అమ్మాయితో పరిచయం ప్రేమగా మారి వారిద్దరూ చాటింగ్‌, ఫోన్లు చేసుకుంటున్నారు. సంక్రాంతికి ఇంటికి వచ్చిన వెంకటేశ్‌ అమ్మాయితో చాటింగ్‌ చేస్తుండగా స్నేహితులు, తల్లిదండ్రులు గమనించారు. ప్రేమ వ్యవహారాలు ఏమైనా ఉంటే మానుకోవాలని మందలించారు. దీంతో సోమవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’

జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ అరవింద్‌కుమార్‌


కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ అరవింద్‌కుమార్‌

ధారూరు: అంధత్వ నివారణకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ అరవింద్‌కుమార్‌ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ఎలా సాగుతుందని వివరాలు సేకరించారు. ప్రతీ ఒక్కరు పరీక్షలు చేయించుకునేలా ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు చొరవ తీసుకోవాలని చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని పెద్దాసుపత్రికి రెఫర్‌ చేయాలన్నారు. 218 మందిని పరీక్షించగా అందులో 29 మందికి కంటి అద్దాలు, 32మందికి మందులు పంపిణీ చేశామని డాక్టర్లు అంబికా, సుష్మ, కేంద్రం కో ఆర్డినేటర్‌ నాగమణి అరవింద్‌కుమార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌

యాలాల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అగ్గనూరు ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సోషల్‌ మీడియా వాడకం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోక్సో చట్టంపట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన, సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ప్రతీ విద్యార్థి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో డయల్‌ 100 గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం షీటీం వాల్‌పోస్టర్లను డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాలాల ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌, ఎంపీటీసీ సభ్యురాలు గరివప్ప, పాఠశాల హెచ్‌ఎం వెంకటస్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్లు శ్రీశైలం, వెంకటయ్య, ఉపాధ్యాయులు మొగులయ్య తదితరులు ఉన్నారు.


అగ్గనూరులో జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులతో డీఎస్పీ, ఎస్‌ఐ, షీటీం సిబ్బంది

ప్రభుత్వ గురుకులాల్లో ఉత్తమ బోధన

- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- ఎంబీబీఎస్‌ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం


తాండూరు టౌన్‌: దీపను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గురుకుల విద్యాసంస్థల్లో అత్యుత్తమ బోధన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని టీఎస్‌ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి దీప ఈ ఏడాది నీట్‌లో 620వ ర్యాంకు సాధించి నిజామాబాద్‌ ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు పొందింది. ఈ సందర్భంగా సోమవారం దీపను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దీప మట్టిలో మాణిక్యమని కొనియాడారు. ఇదే పాఠశాలలో చదివిన దీప సోదరి భాగ్యలక్ష్మితో పాటు ఇప్పటి వరకు నలుగురు విద్యార్థినులు ఎంబీబీఎస్‌ సీటు పొందడం గర్వనీయమన్నారు. గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పన, ఉత్తమ బోధనకు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తాండూరు గురుకుల పాఠశాలలోని సమస్యల పరిష్కరించి మౌళిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ సభ్యులు ప్రభుశంకర్‌, సురేశ్‌, సామాజిక కార్యకర్త వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు

తాండూరు రూరల్‌: ఆర్‌అండ్‌బీ మెయిన్‌ రోడ్డు నుంచి పీఏసీఎస్‌ గోదాం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని అల్లాపూర్‌ శివారులో నాబార్డు కింద రూ.1.48కోట్లతో గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఏసీఎస్‌ సొసైటీ ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ సంగెం రవిగౌడ్‌, వైస్‌ చైర్మన్‌ ప్రశాంత్‌రెడ్డి, ఎంపీపీ అనితాగౌడ్‌, జెడ్పీటీసీ సభ్యురాలు మంజుల, వైస్‌ ఎంపీపీ స్వరూపారెడ్డి, సర్పంచ్‌ నందినిగౌడ్‌, సొసైటీ సీఈఓ శ్రీనివాస్‌, డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బిచ్చప్ప, పెండ్యా నర్సింలు, సిద్ధయ్య స్వామి, పార్వతమ్మ, సిబ్బంది నరేందర్‌, శివచరణ్‌ రెడ్డి, చంద్రారెడ్డి, శ్రీశైలం, బాలగంగాధర్‌ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీ

తాండూరు రూరల్‌: తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు పంపిణీ చేశారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటి నుంచి తాండూరు లబ్ధిదారుల కల్యాణ లక్ష్మి చెక్కులను పట్టణంలోనే పంపిణీ చేయాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న పరిమళ్‌ అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రవిగౌడ్‌, వైస్‌ చైర్‌పర్సన్‌ దీప, జెడ్పీటీసీ సభ్యురాలు మంజుల, ఎంపీపీ అనిత, వైస్‌ ఎంపీపీ స్వరూపారెడ్డి, తహసీల్దార్‌ చిన్నప్పల నాయయుడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

పెద్దేముల్‌: అర్హులందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 98మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడ పిల్లల వివాహాలకు ఇబ్బంది పడకూడదనే ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్‌, తహసీల్దార్‌ విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్‌ మోహన్‌, ఆర్‌ఐ రాజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌చారి, పెద్దేముల్‌ రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వర్గీయుడు పీఏసీఎస్‌ చైర్మన్‌ రవిగౌడ్‌

అల్లాపూర్‌ శివారులో పీఏసీఏస్‌ గోదాంల నిర్మాణ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఎల్మకన్నె పీఏసీఏస్‌ చైర్మన్‌ సంగెం రవిగౌడ్‌ సన్మానించారు. ఏళ్ల నుంచి ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్సీ వర్గం నాయకులు కొన్ని రోజులుగా ఎమ్మెల్యేతో సఖ్యతగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రొటోకాల్‌ ప్రకారమే ఎమ్మెల్యేను సన్మానించారని రవిగౌడ్‌ వర్గీయులు పేర్కొన్నారు. కాగా రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని పలువురు చర్చించుకున్నారు.

పురసారథులకు ‘పరీక్ష’

- ఎల్లుండితో ముగియనున్న మూడేళ్ల పదవీ కాలం
- మున్సిపల్‌ చట్టంలో మూడేళ్ల తర్వాతే అవిశ్వాసం
- నాలుగేళ్లకు సవరిస్తూ బిల్లు చేసిన ప్రభుత్వం
- గవర్నర్‌ తమిళిసై వద్ద పెండింగ్‌లో ఫైల్‌
- అవిశ్వాస తీర్మానాలకు పావులు కదుపుతున్న అసమ్మతులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా/ మేడ్చల్‌జిల్లా: నగర/పురపాలికల్లో క్యాంపు రాజకీయాలకు తెరలేస్తోంది. మూడేళ్ల పదవీకాలం ముగియనుండటంతో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే దిశగా పావులు కదులుతున్నాయి. ఇందుకు వ్యూహరచన చేస్తుండటంతో ప్రస్తుత పాలక వర్గాలు పదవిని కాపాడుకునేందుకు.. వైరి వర్గం కుర్చీ దక్కించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. నగర, పురపాలక సంఘాల్లో అవిశ్వాస పరీక్షలకు మూడేళ్ల కాల పరిమితిని విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పురపాలక చట్టంలో పొందుపర్చింది. దీన్ని నాలుగేళ్లకు సవరిస్తూ గత ఏడాది అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. గవర్నర్‌ తమిళిసై పరిశీలనకు వెళ్లిన ఈ బిల్లుకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. దీంతో పాత చట్టమే మనుగడలో ఉందని భావిస్తున్న అసంతృప్తి నేతలు, అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు పావులు కదుపుతున్నారు. నగర/పురపాలక సంఘాలు పగ్గాలు చేపట్టి ఈ నెల 26 నాటికి మూడేళ్లు ముగుస్తున్నందున ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పురపాలికలపై కన్నేసిన ఆశావహులు ఎత్తులు వేస్తున్నారు. గడువు సమీపిస్తుండటంతో కొంతకాలంగా విందు, విహార యాత్రలతో బిజీగా ఉన్న ఈ నేతలు మరిన్ని వ్యూహాలు రచిస్తున్నారు. నగర శివారులోని దాదాపు మెజారిటీ మున్సిపాలిటీల్లో అవిశ్వాస పరీక్షలు పెట్టే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మేడ్చల్‌ జిల్లాలో..

- మేడ్చల్‌ జిల్లాలో నిజాంపేట్‌, బోడుప్పల్‌, జవహర్‌నగర్‌, పీర్జాదిగూడ, మున్సిపల్‌ కార్పొరేషన్లలో అధికార పార్టీ సభ్యులే వైరి వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుత పాలక వర్గాలకు మూడేళ్లు పూర్తి కావడంతో పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే నిజాంపేట్‌ కార్పొరేటర్లు ఇటీవల శ్రీశైలం వేదికగా, జవహర్‌నగర్‌ నగరపాలక సంస్థ పాలక సభ్యులు ఉభయ గోదావరి జిల్లాలు వేదికగా క్యాంపు రాజకీయాలు నెరిపారు.
- బోడుప్పల్‌ కార్పొరేషన్‌లోనూ గ్రూపు రాజకీయాలు అధికమయ్యాయి. ఇక్కడ కూడా అవిశ్వాస పరీక్షకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మేడ్చల్‌ మున్సిపాలిటీలో కొంత కాలంగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. ఇదే విషయమై మంత్రి సమక్షంలో పలుమార్లు అసంతృప్తి వెళ్లబుచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోనూ అధికార పార్టీలోని ఇరు వర్గాలు నువ్వా నేనా అన్నట్లుగా అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. నాగారం మున్సిపాలిటీలో చైర్మన్‌పై అవిశ్వాసానికి అంతర్గంగా పావులు కదుపుతున్నట్లు అధికార టీఆర్‌ఎస్‌ కౌన్సిర్లలోనే చర్చ జరుగుతోంది. దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దుండిగల్‌, కొంపెల్లి మున్సిపాలిటీల్లోని అధికార పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో..

- ఆదిబట్ల, తుర్కయంజాల్‌, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో అవిశ్వాస పరీక్షలు పెట్టేందుకు అసంతృప్తి నేతలు పావులు కదుపుతున్నారు. గతంలో పదవీ కాలం ఒప్పందాలు కుదుర్చుకున్న సభ్యులు కూడా పట్టు వీడకపోవడంతో కొన్ని చోట్ల విశ్వాస పరీక్షలకు దారితీస్తోంది. ఇంకొన్ని చోట్ల పదవీ నుంచి దిగేందుకు ససేమిరా అనడం కూడా ఈ పరిస్థితులకు కారణంగా మారుతోంది.
- తుర్కయంజాల్‌లో మెజార్టీ కౌన్సిలర్లను గెలుచుకున్న కాంగ్రెస్‌.. రెండు వర్గాలుగా విడిపోయింది. పదవుల పంపకంపై ఇరుపక్షాలు బెట్టు దిగకపోవడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇదే సీను ఇబ్రహీంపట్నం పురపాలికలోనూ కనిపిస్తోంది. గులాబీ శిబిరంలో కీచులాటలతో చైర్‌పర్సన్‌పై కొన్సిలర్లు ఏకంగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. అవినీతి ఆరోపణలు సంధిస్తూ ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాజాగా మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో ఇదే అదనుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై మంతనాలు సాగిస్తున్నారు.
- మరోవైపు ఆదిబట్ల మున్సిపాలిటీలో టీఆర్‌ఎస్‌లో చేరి చైర్‌పర్సన్‌ పదవిని కాంగ్రెస్‌ కౌన్సిలర్‌ దక్కించుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో స్థానిక ఎమ్మెల్యేలతో చైర్‌పర్సన్‌కు పొసగడం లేదు. దీంతో ఆమెను గద్దె దింపే దిశగా ఎమ్మెల్యే వర్గీయులు చక్రం తిప్పుతున్నారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు.. బండ్లగూడ నగర పాలక సంస్థలోనూ చైర్మన్‌గిరీ విషయంలో మడతపేచీ నెలకొంది. ఇక్కడ కూడా రెండున్నరేళ్ల చొప్పున పదవిని పంచుకోవాలనే ఒప్పందానికి వచ్చారు. తాజా పరిణామాలతో పోస్టు నుంచి తప్పుకొనేందుకు నో చెబుతుండడంతో రాజకీయం ఉత్కంఠగా మారింది.

గూడు కోసం గుడిసెలు

గూడు కోసం పేదలు పోరాటబాట పట్టారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రారంభించిన పోరాటం సోమవారం కొనసాగింది. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా వేల సంఖ్యలో వచ్చిన పేదలు ఎర్రజెండా నీడన గుడిసెలు వేసుకున్నారు.

- రోడ్లను దిగ్బంధించిన పోలీసులు
- భూమి తమదంటున్న గడ్డం బాబయ్య వారసులు


గుడిసెలు వేసుకుంటున్న పేదలు

హయత్‌నగర్‌: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని కుంట్లూర్‌ (పాపయ్యగూడ)లోని వివాదాస్పద భూమిలో గుడిసెల ఏర్పాటు ప్రక్రియ రెండో రోజు సోమవారం కొనసాగింది. సర్వేనెంబర్‌ 214 నుంచి 224 వరకు ఉన్న సర్వే నెంబర్లలోని సుమారు వంద ఎకరాల భూమిలో ఆదివారం నుంచి సీపీఐ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ స్థలాన్ని ఖాళీ చేయించాలని రెవెన్యూ, పోలీసు సిబ్బంది ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సోమవారం వేల సంఖ్యలో పేదలు గుడిసెలు వేసేందుకు వచ్చారు. రోడ్లను దిగ్బంధించి పోలీసులు వారిని అడ్డుకునేందు ప్రయత్నించారు. ప్రజలు వేల సంఖ్యలో రావడంతో వారిని ఆపేందుకు పోలీసులకు సాధ్యమవ్వలేదు. ఓ వైపు పోలీసులు అడ్డుకుంటున్నా మరో వైపు నుంచి భూమిలోకి వచ్చి అవకాశం ఉన్న చోట గుడిసెలు వేసుకుంటున్నారు. సోమవారం చీకటి పడేవరకు ఉద్రిక్తత కొనసాగింది.

ప్రభుత్వం ఓఆర్‌సీ ఇచ్చింది: గడ్డం బాబయ్య వారసులు

ఇది ఇలా ఉండగా కుంట్లూర్‌ 210–213, 221–224లలోని సుమారు 68 ఎకరాల భూమి తమకు చెందుతుందని ఈ భూమికి తామే వారసులమని హయత్‌నగర్‌కు చెందిన గడ్డం బాబయ్య వారసులు వాపోతున్నారు. సీపీఐ నాయకులు భూదాన భూమిగా ప్రచారం చేస్తూ పేదలను మభ్యపెట్టడం సరికాదన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వాకిటి పుల్లారెడ్డి అనే భూమి వద్ద మా తాత గడ్డం బాబయ్య కౌలు చేయడంతో కౌలు కింద 68ఎకరాల భూమి సంక్రమించిందని ప్రభుత్వం ఓఆర్‌సీ ఇచ్చిందని, పాత పాస్‌పుస్తకాలున్నాయన్నారు. దీనిపై పుల్లారెడ్డి వారసులమని కుంట్లూర్‌కు చెందిన కొందరు కోర్టుకు వెళ్లడంతో కోర్టులో కేసు కొనసాగుతోందన్నారు. కాగా ఈ భూమికి భూదాన బోర్డుకు ఎలాంటి సంబంధం లేదని, భూదాన భూమి అంటూ పలుమార్లు గుడిసెలు వేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ప్రజలు మోసపోవద్దని వారు కోరారు.